# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 02-12-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలో నాణ్యమైన విద్యుత్ ను సరఫరా చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు.
- ❖ మొంథా తుఫాను కారణంగా రాష్ట్రానికి 6,352 కోట్ల రూపాయల మేర నష్టం వాటిల్లిందని రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత తెలిపారు.
- ❖ రాయలసీమకు కేంద్రంగా తిరుపతి నగరాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు.
- ❖ అమరావతిలో రెండవ విడత భూసమీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది.
- ❖ స్క్రబ్ టైఫస్ వ్యాధి ప్రాణాంతకం కాదని విశాఖ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి. జగదీశ్వర రావు స్పష్టం చేశారు.

======================

రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ కు అనుగుణంగా నాణ్యమైన విద్యుత్ ను సరఫరా జరగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో విద్యుత్ శాఖపై సమీక్షా సమావేశాన్ని ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ట్రాన్స్ మిషన్ నష్టాలను గణనీయంగా తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖను కోరారు. విద్యుత్ కొనుగోళ్ల భారం తగ్గించుకునేందుకు ఇతర రాష్ట్రాలతో విద్యుత్ ని ఇచ్చి పుచ్చుకునే విధంగా ఒప్పందాలు కుదుర్చుకోవాలని సూచించారు. రాష్ట్రంలో పీ.ఎం. కుసుమ్ సహా సోలార్ రూఫ్ టాప్ ప్రాజెక్టులను వేగంగా అమలు చేయాలని ఆదేశించారు. థర్మల్ పవర్ స్టేషన్ల ద్వారా వచ్చే బూడిదను ఇతర అవసరాలకు సద్వినియోగం చేసుకునే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రభుత్వ భవనాలపై సౌర విద్యుత్ ప్రాజెక్టులను చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

=====================

మొంథా తుఫాను కారణంగా రాష్ట్రానికి 6,352 కోట్ల రూపాయల మేర నష్టం వాటిల్లిందని రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్, హోమ్ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఢిల్లీలోని పార్లమెంట్ హాల్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలసి నష్టానికి సంబంధించిన నివేదికను వారు ఈరోజు అందచేశారు. మొంథా తుఫానుతో దాదాపుగా 3,109 గ్రామాలు ప్రభావితమయ్యాయని మంత్రులు పేర్కొన్నారు. తుఫాను బాధిత.. ఒక్కో కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున మూడు వేల రూపాయల తక్షణ సాయాన్ని అందజేశామని తెలిపారు. అనంతరం కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తో వారు సమావేశమై తుఫాను నష్టాన్ని వివరించారు. మొంథా తుపాను కారణంగా సుమారు లక్షా 61 వేల హెక్టార్ల మేర పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సత్వరమే ఆదుకోవాలని మంత్రులు విజ్ఞప్తి చేశారు.

=====================

రాయలసీమకు కేంద్రంగా తిరుపతి నగరాన్ని అభివృద్ధి చేస్తామని రాష్ట్ర రెవిన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. తిరుపతిలోని కలెక్టరేట్ లో జిల్లా అభివృద్ధిపై సమీక్షా సమావేశాన్ని మంత్రి ఈరోజు నిర్వహించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ గా తిరుపతిని మార్చాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉందని చెప్పారు. తిరుపతిని ప్రత్యేక రైల్వే జోన్ గా ప్రకటించాలన్న డిమాండ్ ను ప్రభుత్వం పరిశీలిస్తోందని మంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 35 సెకన్లు)

=====================

అమరావతిలో రెండవ విడత భూ సమీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను ఈ రోజు జారీ చేసింది. ఏడు గ్రామాలలో 16 వేల 666.57 ఎకరాల పట్టా, ఎసైన్డ్ భూమి సమీకరణ బాధ్యతను సీఆర్డీఏ కమిషనర్‌కు అప్పగిస్తున్నట్లుగా ఉత్తర్వులలో పేర్కొంది. ఈ ఉత్తర్వుల ప్రకారం రాజధాని ప్రాంతంలోని ఏడు గ్రామాలలో భూ సమీకరణ చేపడతారు. అమరావతి మండలంలోని వైకుంఠపురం, పెద్ద మద్దూరు, ఎండ్రాయి, కర్లపూడి, లేమల్లె గ్రామాలు, గుంటూరు జిల్లా తుళ్లూరు మండలంలోని వడ్లమాను, హరిచంద్రపురం, పెద్ద పరిమి గ్రామాలు భూ సమీకరణలో ఉన్నాయి. పట్టా, అసైన్డ్ భూములతో పాటు ప్రభుత్వ భూములు ఇందులో ఉన్నాయని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

విరామం

=====================

స్క్రబ్ టైఫస్ వ్యాధి ప్రాణాంతకం కాదని విశాఖపట్టణం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వర రావు పేర్కొన్నారు. ఈ వ్యాధి గురించి ప్రజలు భయాందోళన చెందనవసరం లేదని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వ్యాధికి కారణమైన పురుగు కుట్టినప్పుడు జ్వరం, తలపోటు, కండరాల నొప్పులు, ఆకలి లేకపోవడం, కణుపుల వాపు, వినికిడి తగ్గుదల, దగ్గు, శ్వాస ఆడకపోవడం వంటివి లక్షణాలుగా ఉంటాయని చెప్పారు. చికిత్సతో పాటు మందులు వాడటం ద్వారా ఈ వ్యాధిని నివారించవచ్చునని చెప్పారు. విశాఖ జిల్లాలో స్క్రబ్ టైఫస్ వ్యాధికి సంబంధించి 2023లో 12, 2024లో 11, 2025లో 11 పాజిటివ్ కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ కేసులలో ఒక్క మరణం కూడా సంభవించలేదని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

=====================

కృష్ణా విశ్వ విద్యాలయంలో కృష్ణ తరంగాలు - 2025 సాంస్కృతిక కార్యక్రమాన్ని ఈ నెల 4, 5, 6వ తేదీలలో నిర్వహిస్తున్నామని ఉప కులపతి కూన రాంజీ తెలిపారు. విశ్వ విద్యాలయ పరిధిలోని 144 కళాశాలల నుండి విద్యార్థులు కృష్ణ తరంగాలు కార్యక్రమంలో పాల్గొంటున్నట్లుగా ఆయన చెప్పారు. ఈ సాంస్కృతిక కార్యక్రమాన్ని ప్రారంభించడానికి ముఖ్య అతిథులుగా పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు, రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు

రవీంద్ర, అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ హాజరవుతున్నారని వివరించారు. విశ్వ విద్యాలయం అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వ పథకమైన పీఎం పూర్ణోదయ నుండి 45 కోట్ల రూపాయల అంచనాలను కేంద్ర విద్యా శాఖకు పంపామని ఆయన తెలియచేస్తూ...

(వాయిస్ 24 సెకన్లు)

=====================

ప్రజలకు నాణ్యమైన, సరసమైన ధరలకు ఉత్పత్తులు అందేలా చర్యలు తీసుకోవడం ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. విజయవాడ పటమట రైతు బజార్ ను మంత్రి ఈ రోజు తనిఖీ చేసి, కూరగాయల ధరలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అభిప్రాయాలు, సమస్యలు తెలుసుకున్నారు. అన్ని రకాల కూరగాయలు రైతు బజార్లలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. అదే విధంగా బియ్యం ఇతర ధాన్యాలు నాణ్యతతో విక్రయించాలన్నారు.

=====================

అమృత్ 2.0 కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని 104 పట్టణాలలో 552 ప్రాజెక్టుల ద్వారా ప్రజలకు సురక్షిత తాగునీటి సరఫరాతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం నిధులు కేటాయించడం పట్ల ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ఆర్ధిక సంఘం వాటాతో 8,517.69 కోట్ల రూపాయిలను కేటాయించారని చెప్పారు. అమృత్ 2.0 కింద ఎక్కడెక్కడ అసంపూర్తిగా పనులు ఉన్నాయో వాటిని పూర్తి చేస్తూ.. భవిష్యత్ అవసరాలకు ఉపయోగకరంగా పనులను చేపడతామని ఆయన తెలిపారు.

=====================

నైరుతి - పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం కొనసాగుతోంది. ఇది నైరుతి దిశగా పయనించి వాయుగుండంగా మారే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఇది ఉత్తర తమిళనాడు తీరాన్ని ఆనుకొని ఉన్నట్లు తెలిపారు. దీని ప్రభావంతో రానున్న 24 గంటలలో కోస్తాంధ్ర తీరం వెంబడి గంటకు 30 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని చెప్పారు. ఆ వివరాలను వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ వెల్లడిస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

=====================

చిత్తూరు జిల్లాలో రేపు నిర్వహించనున్న రైతన్న మీకోసం కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది అంతా పాల్గొనాలని జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 313 క్లస్టర్లలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

=====================

=====================